# శ్రీ మాష్టారి మంచి బోధలు



రచన :

పెసల సుబ్బరామయ్య

ఓం శ్రీ సాయిరామ్

# ఇండెక్స్

1. శ్రీ మాష్టారి జీవిత బోధలు

2. మఠనిర్మాణంలో శ్రీ మాష్టారి బోధలు

## అంకితం

నన్ను మనిషిగా మలచిన శ్రీ మాష్టారి
దివ్యపాదారవిందములకు

సర్వ సామ్యములు : స్వామి కృప పబ్లికేషన్స్ ట్రస్ట్

ప్రాప్తి స్థానం : **స్వామి కృప పబ్లికేషన్స్**
గొలగమూడి,
నెల్లూరు జిల్లా - 524 321

ముద్రణ : *BSF* శ్రీ బాలసుబ్రహ్మణ్యం ఫ్యాన్సీ స్టోర్సు, గుంటూరు. ఫోన్ : 224019

# ప్రార్ధన

గురు మధ్యే స్థితం విశ్వం, విశ్వమధ్యే స్థితో గురుః
గురుర్ విశ్వం నచాన్యోస్తి తస్మై శ్రీ గురవేనమః

పూజ్యపాదులు శ్రీ మాష్టరు గారిని గురించి ఇరవై పేజీలలో వ్రాయడం ఎవ్వరికీ సాధ్యం కాదు. కానీ ఉడతాభక్తిగా ఈ శుభ సమయంలో వారిని స్మరించాలనే తపనే ఈ చిన్నపుస్తక రూపము. ఇందులో అనంతమైన వారి జీవిత విశేషాలకంటే, అంతకంటే అధికముగా నున్న దివ్య లీలల కంటే, అంత కంటే ఎక్కువగానున్న స్వప్నదర్శనాలు భౌతిక దర్శనాల కంటే, వారు మానవాళికి బోధించిన దివ్యబోధలు, స్మరించాలనే ఆకాంక్షే ఈ చిన్న గ్రంథము. సర్వశాస్త్రముల సారమే మరొక భంగిమలో అక్షర జ్ఞానము లేనివానికి గూడ అర్ధమై ఆచరణ యోగ్యమైన మాటలే ఇవి. ఈ చిన్న సేవచేసే బుద్ధి కుశలత నొసంగిన శ్రీ మాష్టరుగారికి అనంత కోటి సాష్టాంగ దండ ప్రణామములు సమర్పిస్తున్నాను.

సాష్టాంగ దండ ప్రణామములతో

**పెసల సుబ్బరామయ్య**

ఆచార్య శ్రీ భరద్వాజ మాష్టరుగారు 30-10-1938 సం॥న పూజ్య శ్రీ అనంతాచార్యులు మరియు శ్రీమతి బుచ్చమ్మ అను పుణ్య దంపతులకు బాపట్లలో జన్మించారు. వీరి అన్నలు శ్రీ కృష్ణమాచారి, శ్రీ వేద వ్యాస, శ్రీ బోధాయన. వీరికి నాలుగు సంవత్సరాల ప్రాయంలోనే తల్లి స్వర్గస్థురాలైంది. అప్పటి నుండి శ్రీ అనంతాచార్యులు గారే తన నలుగురు బిడ్డలకు విద్యాబుద్ధులు, ప్రాణాయామం, యోగాభ్యాసం, జ్యోతిష్యం, సంస్కృతం, ఆయుర్వేదం నేర్పించారు. చిన్న నాటి నుండి శ్రీ మాష్టరుగారు కండపుష్టి గల్గి అచ్చం సింహం పిల్లలా ఉండేవారు. చిన్ననాటి నుండి తానను కొన్నది సాధించి తీరే పట్టుదల గలవాడని అందరూ ప్రశంసించేవారు. వాని యోగ విద్యాప్రావీణ్యమెంతటిదో తెలిపే ఒక ఉదాహరణ - చిన్న పిల్లవాడుగా ఉన్నప్పుడు గారడి విద్య అయిుంది. ప్రదర్శించే వానిపై తన యోగదృష్టిని నిలపగా వాడా విద్య ప్రదర్శించ లేక ఈ చిన్న పిల్లవానికి పాదాక్రాంతు డయ్యాడు. వీరి ధైర్యము, సాహసము, నిబ్బరము తెలిపే ఉదాహరణ. చిన్నప్పుడు వీరికి చెవి నొప్పి వస్తే డాక్టరుకు చూపించి రమ్మన్నారు. చెవిలో దుర్మాంసం పెరిగింది. పెద్దవాళ్ళను తీసుకువస్తే ఆపరేషన్ చేస్తానన్నాడు డాక్టర్. పెద్దవాళ్ళు అక్కరలేదని, మత్తుమందు పనిచేయకున్నా, అంతటి బాధ ధైర్యంగా ఓర్పుగా భరించి తానొక్కడే ఆపరేషన్ చేయించు కొనివచ్చాడు. ఎంతటి కష్టాన్నైనా ప్రశాంతంగా భరించే గుణం వీరికి పుట్టుకతో వచ్చింది. చిన్నప్పటి నుండి చాలా గాఢంగా నిద్ర పోయేవాడు. తొమ్మిదవ ఏట అక్షరాలు వ్రాయడం మొదలు పెట్టి 12వ ఏట మెట్రిక్యులేషన్ వారణాసిలో పాసయ్యాడు. మెట్రిక్యులేషన్ వరకు బడికి పోకుండా తండ్రి చెంతనే విద్యనేర్చారు. చిన్ననాటి నుండి బహుముఖ ప్రజ్ఞా దురంధురుడు. ఏకాగ్రత, రోషం, పట్టుదల వీరికి వెన్నతోపెట్టిన సుగుణాలు. ఒకసారి వీరు సరిగా పాఠం వినడం లేదని

లెక్చరర్ ఒక సమస్యను బోర్డుమీద విశదీకరించ మంటే చక్కగా వ్రాసి ఆ లెక్చరర్ లాగానే అభినయిస్తూ "అండర్ స్టాండ్" అన్నారట. ఆ లెక్చరర్ తనను అనుకరించాడని క్షమాపణ చెప్పమంటే "నే నేమి తప్పుచేశాను" అని క్షమాపణ చెప్పలేదట పాపం ఆ లెక్చరర్ తలవంచుకొని వెళ్ళిపోయాడు. తన మేధస్సును హాస్యముతో మేళవించే నేర్పరి.

తనను గురించి ఇతరులేమనుకుంటారో నన్న దృష్టేలేదు. ఆర్థిక ఇబ్బందులవలన యమ్.ఎ. చదివినంతకాలం కాళ్ళకు చెప్పులు, బట్టలకు ఇస్త్రీ లేకుండానే చదివారు. పాఠ్యపుస్తకాలు కొనలేక తన స్నేహితులు నిద్రపోయేటప్పుడు వారి పుస్తకాలు చదివేవాడు. వీళ్ళ అన్నగారైన వేదవ్యాస్ గారితో మాట పట్టింపు వచ్చి మూడు నెలలు చదివి ఐ.ఎ.ఎస్. పాసయ్యారు. హైదరాబాద్, ఒంగోలు, బాపట్ల, గుంటూరు, విద్యానగర్ పట్టణాలలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేశారు. వారి నాన్న గారి హితబోధ ప్రకారం సాటి జీవుల శ్రేయస్సు కొరకు పాటుపడడమే తన ధర్మంగా జీవితాన్ని సాగించారు.

**1963** సం॥లో శ్రీ వేదవ్యాస్ గారి ప్రోద్భలముపై షిరిడీ వెళ్ళి శ్రీ సాయి సమాధి దర్శనంతో ఐదుగంటల సేపు సమాధి స్థితి ననుభవించారు. దానితో వారి జీవితమార్గమే మారింది. కాలం చక్కగా ఉపయోగించు కొనేవారు. లైబ్రరీ పుస్తకాలు తెచ్చుకొని పబ్లిక్ గార్డెన్స్‌లో చదివేవారు.

సర్వశాస్త్రాలు, సకల మతాలు బోధించే బోధ ఒక్కటే. భగవంతుడు సర్వత్రా ఉన్నాడు. ఈ జగత్తంతా భగవంతుని దివ్య రూపము. కనులకు కన్పించే జగత్తు రూపంలో నున్న భగవంతుని సేవించి తరించండి. అంతటా ఉన్న పరమాత్ముని హృదయ పూర్వకంగా సేవించేందుకు శ్రీ సాయిలీలా మృతము, శ్రీ గురు చరిత్ర, శ్రీ సాయి ప్రబోధామృతము, శ్రీ సాయి సన్నిధి





అను గ్రంథ రాజాలను రచించి సంఘానికర్పించారు. ఈ గ్రంథాలలో సర్వ శాస్త్రాల సారం ఇమిడి ఉంది. ఆ సారాంశం ఏమిటి ? భగవంతుని చేరేందుకు సద్గురుని సహాయం అత్యవసరం. ఆ సద్గురుని సేవించే విధం చక్కగా, హృదయానికి హత్తుకునేలా చెప్పారు. పరమాత్మే సద్గురు రూపంలో భూమి మీద అవతరించారు. సర్వ జీవులలో ఏ జీవిని ఆదరించినా ఆ పరమాత్మను ఆదరించినట్లే, ఏ జీవిని నిర్లక్ష్యం చేసి హింసించినా అదీ ఆ పరమాత్మకే చెందుతుంది. ఈ విషయం సజీవ ఉదాహరణలతో మరుపురాని విధంగా పైన తెల్పిన తన గ్రంథాల ద్వారా మానవాళికందించారు. అంత మాత్రమెవరైనా చేయగలరు. కానీ తాను విశ్వసించి వ్రాసిన సత్యాలను తన ఆచరణతో లోకానికి బోధించిన బోధే అమరబోధ. వారి ఆచరణే భక్తుల హృదయాలపై నేటికీ వారి మహాసమాధి అనంతరం కూడా చెప్ప నలవికాని ప్రభావం చూపుతుంది.

ఆ మహనీయుడు ఆచరించినంతలో చాలా కొద్ది మాత్రము మన మాచరించినా తరించి పోగలము.

## ఆచరణ :

### సంఘశ్రేయస్సు కొరకు :

తన చుట్టు ప్రక్కల నున్న మానవులేగాా మిగిలిన జీవులు కూడా తన గురు రూపాలుగా, ఆపరమాత్మ యొక్క ప్రతిరూపాలుగా ప్రేమించి ఆదరించారు. ఏ వైద్య సౌకర్యమూ లేని విద్యానగర్ లో ఒక డాక్టరును పెట్టి వైద్య సౌకర్యం కల్పించారు. ఆ డాక్టరుగారి జీతాలకు, మందులకు, తన ఖర్చుతో చదివించే విద్యార్థులకు, మహాత్ముల దర్శనాలకు గాను తన ఖర్చులకూ తన జీతం చాలకుంటే ఉదయం టిఫిన్ కాఫీలు మాని చద్దన్నంతిని జీవించిన ధన్యమూర్తి. ఐ.ఎ.యస్. చదివిన మేధావంతుడు సాటి జీవుల కొరకు టిఫిన్ తింటే హోటలు బిల్లు ఎక్కువౌతుందని చద్దన్నం తినడమా? మనం మన అవసరాలను సాటి జీవుల కొరకు ఎంతవరకు మానుకొని వారికొరకు ఆదాచేసి ఖర్చుపెడుతున్నాము. అవసరాలు మాను కోకున్నా పరవాలేదు. మనకు భగవంతుడనుగ్రహించిన సిరి సంపదలను ధర్మబద్ధంగా సాటిజీవుల కొరకు వినియోగిస్తున్నామా? అన్న విషయం ఎవరికి వారు ఆలోచించుకొనవలసి ఉంది.

### అన్నదానం :

ఆనాడు విద్యానగర్‌లో హోటలే లేదు. తన దివ్యబోధలు వినేందుకు, తమకష్టాలు చెప్పుకొని తీర్చుకొనేందుకు సుదూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు, ఇండ్లలో ప్రేమ ఆదరణ కరువైన అభాగ్యులకు కొన్నాళ్ళు మెస్‌లోను తర్వాత టి.డి. క్రిష్ణమూర్తి గారింట్లోను షడ్రసోపేతంగా భోజనం పెట్టించేవారు. క్రిష్ణమూర్తి గారింట్లో ఘుమ ఘుమలాడే నెయ్యితో వందమందికి పైన భోంచేశాము. అలాంటి ఆప్యాయత, అభిమానము అందించిన క్రిష్ణమూర్తిగారి





కుటుంబసభ్యులు ధన్యులు. అలాంటి బీజాలు వారి హృదయాలలో నాటి, మొలిపించి, ఆ ప్రేమలతలను అల్లించిన సాయి మాష్టర్ గారికి ఆనాడే నా హృదయ మర్పించాను. తన దగ్గర కొచ్చిన ప్రతి మానవుడూ తన గురుదేవుని ప్రతి రూపమనే వారి భావన వారి చర్యలలో స్పష్టమయ్యేది. ఆవిధంగా మనలను కూడా నడుచుకొని తరించమని తన ఆచరణ ద్వారా బోధిస్తున్నారు.

పై ఖర్చులకు డబ్బు చాలదని వివాహానికి ముందు ఇస్త్రీ గుడ్డలు మాని తానే సబ్బుతో ఉతుక్కున్న బట్టలు ధరించి కాలేజీకి వెళ్ళేవారు.

నిన్నాశ్రయించిన ఏ ప్రాణిని తోలెయ్య వద్దు, ప్రేమతో ఆదరించు అన్న సాయి వాక్యాన్ననుసరించి తన నాశ్రయించిన వారితో మాట్లాడుతూ వారికష్టాలు ప్రేమతో వింటూ కాలేజీకి వెళ్ళేటైం అయ్యేవరకు అలా కుర్చో నుండే వారు. పదినిమిషాల ముందు లేచి త్వరత్వరగా ఒకే ఇడ్లీ మొత్తం ఒక్కసారే ముద్దచేసి నోట్లో పెట్టుకొని ఒక్క నిమిషంలో చొక్కా ప్యాంటు ధరించి మరునిమిషంలో రోడ్డున నడిచే వారు. క్రొత్త వారికి చాలా ఆశ్చర్యంగా ఉండేది. రాత్రి పుస్తక పఠన, రచన. ఈ విధంగా తన కాలాన్నంతటినీ తన గురు సేవకే అంకితం చేసిన ధన్యమూర్తి. మనకాలాన్ని టి.వి.లు, కబుర్లు, సినిమాలకు వృధాచేయవద్దని గురుసేవకు వినియోగించి ధన్యత చెందమని బోధిస్తున్నారు. పారాయణకే కాలం లేని మనకు వారి ఆచరణే చక్కనిబోధ.

### సత్‌సంగము :

భగవంతుడు మననుండి నిజంగా కోరేవి మనకాలము, మన మనస్సు, వీటిని భగవంతున కర్పించినట్లయిన వారు మనల నెలా కాపాడు తారో నన్న దానికి చక్కని ఉదాహరణే వారి పనిపిల్ల. శ్రీ మాష్టారు స్నానంచేస్తుంటే పని పిల్ల రూము చిమ్ముతుంది. బాబాగారిపటం ముందున్న

చిల్లర డబ్బుల్లో పదిపైసలు తీసుకోబోయింది. పటంలోని బాబా ఆ పిల్లకు భౌతిక దర్శనమిచ్చి చెయ్యెత్తి కొడతానని బెదిరించారు. ఆ పిల్ల చీపురు అక్కడ పడేసి పెద్ద కేకపెట్టి ఏడుస్తూ రూముబయట కొచ్చి ఏడుస్తుంది. ఎంతోసేపు బ్రతిమాలాక అసలు విషయం చెప్పింది. శ్రీ మాష్టారు భగవంతుడు కోరిన తన కాలాన్ని మనస్సును భగవంతున కర్పించారు గనుక అక్కడ పదిపైసలు కూడా పోనీయకుండా రక్షించారు. దీని పర్యవసానమే విద్యానగర్‌లో పన్నెండు సంవత్సరాలు కాపురమున్న కాలంలో సెలవలలో ఇంట్లో ఎవ్వరూ లేకపోయినా ఇంటికి తాళం వేసే వారు కాదు. లోపల బాబా ఉన్నారు గదా !

మనం మన కాలమూ, మనస్సూ టి.వి.లు, సినిమాలు, కబుర్లు, చెత్త పుస్తక పఠనము, పేపరు చూడడం, వ్యాపారాల గొడవలలో వెచ్చించి గురువారం మాత్రం తీరికైనప్పుడు హారతిస్తాము. మన కష్టాలలో బాబా వచ్చి ఆదుకో లేదని ఫిర్యాదుచేస్తాము. గనుకనే ఆమహనీయ మూర్తి మన కిచ్చిన వాత్సల్య పూరితమైన సలహా "మీరున్నచోట సత్‌సంగం చేయండి నాకు లక్ష లిచ్చినట్లు" అని బోధించారు. తనను కబుర్లతో గేలిచెయ్యాలని వచ్చే వారు వాకిట్లోకి రాగానే "రండి రండి మీకీ విషయం తెలుసా? అక్కల్ కోటస్వామి మంచుగడ్డ వంటి బండమీదపడుకొని ఒకరికి పాఠం చెప్పాడు" అని ఆ వచ్చిన పెద్ద మనిషికి లౌకిక పురాణాలచెత్త మాట్లాడే అవకాశం ఇవ్వకుండా మాట్లాడేవారు. మాష్టారిదగ్గర కెళితే ఇలాంటి సంభాషణేనని అది నచ్చినవారు మరలా వస్తారు. నచ్చకుంటే ఇకరారు. మనలను కూడా ఎక్కడ స్నేహితులు కలసినా ఇలాంటి సంభాషణలు చేస్తూ కాలమూ, మనస్సు భగవంతున కిమ్మని చెప్పారు. బాబా మనకెన్ని కోరికలు తీర్చినా వారు కోరిన మనస్సు, కాలము వారికి సమర్పించ కుంటే మనకొద్దిపాటి జీవితకాలం





వృధాచేసి పసిపిల్లలు వెయ్యిరూపాయల నోటును సరదాకు నిప్పులో వేసినట్లే ఉంటుందన్నారు. వెన్నెల పువ్వులు అనే గ్రంథంలో శ్రీ మాష్టారు చెపుతారు: టాటాబిర్లాల వంటి శ్రీమంతులు మొదలుకొని అడుక్కునే వారి వరకు అందరూ అనుక్షణం ఒక విషయం మరచిపోతున్నారు. "అనుక్షణమూ మనం మృత్యువుకు దగ్గరవుతున్నాము' అన్నదే ఆ విషయం. అది అనుక్షణం గుర్తు పెట్టుకొని గురుకృపకు పాత్రులయ్యేటట్లు జీవించమని తన ఆచరణతో బోధించారు.

శ్రీ మాష్టరుగారి మహోన్నతమైన ఆశయం-భగవంతుని ప్రతి రూపాలైన మానవులంతా తృప్తి, శాంతి, ఆనందం పొందాలనే. అందుకు ఆ మహనీయమూర్తి అతిసులభమైన మార్గం చెప్పారు - జీవిత కళనెరిగి జీవించడం.

జీవితకళ అంటే ఏమిటి సార్ అంటే చక్కగా డాన్సు చేయడమే నోయ్ అన్నారు. ఇప్పుడు మేము డాన్సునేర్చుకోవాలాసార్ అంటే డాన్సంటే జీవిత విధాన మోయ్ అన్నారు. ఆవిధానమేమిటిసార్ అంటే - ఇష్టం అయిష్టం లేకుండా జీవించడమన్నారు. ఇష్టాఇష్టాల వల్లనే రాగద్వేషాలు, వాటి మూలముగా ఈ జన్మలోనే గాక మరుజన్మకు కూడా శాంతి ఆనందాలు కరువయ్యే విధంగా ప్రవర్తించవద్దన్నారు. ఇష్టము, అయిష్టములేకుండా జీవించాలంటే సర్వానికి అధికారి దైవమే అనే గుర్తింపు ఏమార్పు లేకుండా ఉంచుకొని జీవించాలి. ఉదాహరణకు - విద్యానగర్ శంకుస్థాపన, అన్నదానం, మరియొక మందిరంపై మతచిహ్నాల బొమ్మలు పెట్టడం వివరణ "నాకు తెలిసిన మాష్టర్" అనే గ్రంధములో చూడగలము. సర్వానికీ యజమాని భగవంతుడే అన్నదే వారి ముఖ్యసూత్రము. నా మాటకు విలువేముంది అనే

భావం ఏనాడూ రానివ్వలేదు. అలాగే మనమూ నడుచుకుంటే అంతులేని ఆనందం, ఆపైన సద్గురు కృప తప్పక కలుగుతాయని బోధించారు.

సర్వానికీ యజమాని భగవంతుడే అని నోటితో చెప్పి పుస్తకాలలో చదివితే చాలదు. ఆ భావంతో ప్రతి కార్యమూ అటుదైవకార్యాలు కాని, ఇటు సొంతకార్యాలు కాని నడుచుకుంటే దుఃఖమే దగ్గరకు రాదు. అదే ముక్తి అన్నారు. గనుక ఇష్టము అయిష్టము లేకుండా జీవించాలంటే సర్వానికీ యజమాని భగవంతుడే అన్నదొక్కటే మందు. అదే సర్వస్య శరణా గతికి మనలను తీసుకుపోతుంది.

నీవు సత్యానికంటి పెట్టుకొని ఇచ్చిన మాట తప్పక చెల్లించు. నేనెప్పుడూ నీ చెంతనే ఉంటాను. దీనిని మాటలలోనే సత్యమని తలవడం పొరపాటు. మనం చేసే ప్రతిపనికీ మన సర్వ ఆలోచనలకూ ఈ ఒరుపు రాయి అత్యవసరము అని బోధించారు. నేనెప్పుడు విద్యానగర్ నుండి కలిచేడు పోవాలన్నా ఉదయం 5.30 గంటల బస్సుకే పొమ్మనే వారు. ఈ బస్సుకు పోతే 9 గంటలకే ఇల్లుచేరుతాను. స్కూలు 10 గంటలకు. ఈ గంటలో స్నానం చేసి టిఫిన్‌తిని తాపీగా స్కూలుకు పోగలను. చక్కగా బోధించగలను. అదే 6 గంటల బస్సుకు పోతే గూడూరులో 1 గంటసేపు బస్సు కొరకు వేచి యుండాలి. 10 గంటలకే ఇల్లు చేరుతాను. స్నానానికి, టిఫిన్ తినే వ్యవధి ఉండదు. బట్ట మార్చుకోకుండానే బడికి వెళ్ళాలి. అలా పోతే నేనేమి పాఠాలు బోధించగలను. ఇదంతా ఆపుణ్యాత్ముడు బోధించినదే. అలారం పెట్టి గడియారం నాచేతికిచ్చేవారు. మనం విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలి. ఎవ్వరూ వేలెత్తిచూపలేని విధంగా నడుచుకోవాలి. ఎవరిని మెప్పించినా మెప్పించకపోయినా సాయినాథుని మెప్పు పొందేందుకు మన జీవిత



శ్రీ మాష్టారి జీవిత బోధలు

విధానమేగాక వృత్తి నిర్వహణకూడా ఉండాలని బోధించేవారు. ఈ సూత్రాన్ని అంటే సాయిని మెప్పించటమే మన ధ్యేయంగా పెట్టుకుంటే ఎప్పుడూ వారు మనచెంతన నుంటారు గనుక దుఃఖము మన చాయలకే రాదు. ఈ విశాల విశ్వమంతా భగవంతుడు నిర్వహించే విశ్వయజ్ఞమని అందు మనకిచ్చిన పాత్రను పరమాత్మ మెప్పుపొందేటంత చక్కగా నిర్వహించాలని చెప్పేవారు. ఈ మాటను ఉపాధ్యాయులేగాక వ్యవసాయదారులు, వ్యాపారస్తులు, ప్రభుత్వోద్యోగులు, కూలీలు, గృహకృత్యాలు నిర్వహించు తల్లులు ఒకరేమిటి అందరూ పాటిస్తే భూలోకస్వర్గమే అవుతుంది. ఆస్పత్రులు ఇంత విరివిగా ఉండనక్కరలేదంటారు. సత్యం, ధర్మం తప్పవద్దు, సద్గురుని సేవించు, సంపన్నత్వం సాధారణత్వం సాధించు అన్న శ్రీ వెంకయ్య స్వామి వారి మాట ఇదే గదా ?

నేడు నిర్వహించబడు సాయి మందిరాలకే గాక ఇతర మందిరాలకు కూడా శ్రీ మాష్టారి బోధ వర్తిస్తుంది.

నేటి మందిరాలన్నీ బంగారు నగలతోను వాటిని సంరక్షించు సిబ్బంది తోనే నిండి ఉండడం చూచి శ్రీ మాష్టారు ఎంత ఆవేదన చెందారో కలిచేడు సాయి మందిర శంకుస్థాపనప్పుడు ముందటిరోజు రాత్రంతా నన్నూ, ట్రెజరర్ గారిని మేలుకోబెట్టి ఎన్నోబోధించి వివరించారు. అల్పబుద్ధి గలనేను కొంతవరకే మీ ముందుకు తేగల్గుతున్నాను.

**పూజారి :**

అంకిత భావం గలవాడు. ఉన్నంతలో తృప్తిచెందువాడు, తన తరింపే ధ్యేయముగా గలవాడు. భగవంతుని యందు ఎట్టి పరిస్థితులలోను చెదరని విశ్వాసముగలవాడు, సాటి మానవులను సాయి రూపాలుగా ప్రేమించ గలవాడైతే సాయిని చక్కగా సేవించగలుగుతాడు. వైద్యం కొద్దోగొప్పో

తెలిసినవాడై కనీసం హోమియోమందైనా ఇవ్వగలగాలి. అవసరమైతే పెండ్లి చేయడం, తద్దినాలు పెట్టించడం, కర్మక్రతువులు చేయించడం, పూజలేగాక పదిమంది పిల్లలకు చదువు చెప్పే ఓపిక గలవాడుగా ఉండాలి. ఆల్ ఇన్ ఆల్ అన్నట్లు కరెంటు పోతే కొద్దిపాటి కరెంటు పని తెలిసుండాలి. ఇలాంటి వ్యక్తి అయితే చుట్టుప్రక్కల అందరికీ తలలోని నాలుకయై మిషనరీ జీల్‌తో కృషిచేసి తాను తరించి తోటి వారిని తరింపజేయగలడు. ఇలాంటి పూజారి దొరకడం కష్టమని తలచరాదు. దీక్షతో పారాయణచేస్తే సాయియే పంపుతారు.

**మందిర మెలా ఉండాలి :**

నా దర్బారు అన్నివేళలా తెరిచే ఉంటుంది అన్నట్లు ఉండాలి. నేటి మందిరాలన్నీ విలువైన వస్తుసామగ్రితో ఉండి సాయినాధుని ఆ సామగ్రి మధ్య బంధించి తలుపులు బిగించి కాపలా వారి కప్పగిస్తున్నారు. దీపపు స్థంభాలు కూడా అక్కరలేకుండా ఒక బండకు చిన్నగుంట కొట్టించి ప్రమిదవలె వాడుకుంటే సరి. పటం చుట్టూ గోడలో చిన్నచిన్న గూళ్ళమర్చి పర్వ దినాలప్పుడు ప్రమిదలలో దీపాలు వెలిగిస్తేసరి. ఎల్లప్పుడూ ఆ మహనీయుని ఊది తరుగులేకుండా ఉంచితే చాలు.

**మందిర ఫండ్సు :**

నేడు మందిరాలన్నీ విలాస కేంద్రాలుగా తయారయ్యాయి. సాయికి సమర్పించబడిన డబ్బంతా వారి దుస్తులకు, కిరీటాలకు, గోడల నగిషీ పనులకే ఖర్చు చేస్తున్నారు. ఇంకా మిగిలితే ఒకటికి నాలుగు రకాల నివేదనలు చేయిస్తున్నారు. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతముగల అన్నదానాలు చేయిస్తున్నారు. (1) చాతనైతే చక్కగా నిర్వహించబడే ఉచిత వైద్యశాల నిర్వహించండి. (2) కాకుంటే చుట్టుప్రక్కల గల వైద్యశాలలో మందులు





కొనలేని దరిద్రనారాయణులకు మందులు కొని ఇవ్వండి. (3) అలాంటి పేదవారికి అవసరమైన పుష్టికరమైన ఆహారం, పాలు, పండ్లు ఇవ్వండి. (4) వారి కవసరమైన బట్టలు ఇవ్వండి. (5) పైచదువులు చదివేందుకు ఆర్థిక స్థోమతలేని బ్రిలియంట్ విద్యార్థులకు అన్ని విధాలా సహాయం చేయండి. (6) ఆధ్యాత్మిక లైబ్రరీలు నెలకొల్పి నావల్సు, న్యూస్‌పేపర్లు కాకుండా అరుదైన ఆధ్యాత్మిక గ్రంధాలు అందుబాటులో ఉంచండి. ఆ గ్రంధాలయాన్ని ఎందరు ఉపయోగించుకొన్నారు అనే దాన్ని కాకుండా ఒక్కరుపయోగించుకున్నా మనంవెచ్చించిన లక్షల రూపాయలు సార్థక మయ్యాయని భావించండి. గ్రంధాలు కొని చదవలేని వారికి మహనీయులందరి జీవితచరిత్రలూ అందించండి. (7) ఉచిత విద్యాలయాలను నిర్వహించండి ఈ విషయంలో శ్రీ సత్యసాయిబాబా ఆదర్శనీయుడు. ఇలాంటి విషయాలు ఆచరించకుండా ఎంతో ఆటోపంగా మందిరాలు ఉండేటట్లు, పూలంగి సేవలు చేయించి తరించామని తలవడం ఎంత వరకు సాయికి సమ్మతమో ఆలోచించండి. ఇది వారు రాత్రంతా బోధించిన విషయాల సారాంశం నాగ్రుడ్డి మెదడు పట్టుకున్నంత మీ కందించగలిగాను. విద్యానగర్ మందిరంలో వారున్నంత వరకు వీటిలో ఎన్నో అమలు జరిపారు.

**సాధనలను గూర్చి :**

పరాయణత్వములేని పారాయణలు అంటే కథలో మనసు మునిగి పోకుండా లౌకిక ఆలోచనలతో నిండిన మనస్సు గలిగి కండ్లు, నోరు చదివే పారాయణలు - మానమన్నారు. ఆలీల ఎందుకుచేశారు, ఎందుకు గ్రంధస్థము చేయించి కరుణతో మనకందించారు అనే విషయం తెలుసుకొని అందలి నీతిని హృదయానికి పట్టించుకొని ఆచరించి తరించమన్నారు. లెక్కకు పనికొచ్చే పారాయణలను - సంఖ్యాపరమైన పారాయణలు మానమన్నారు.

అలాగే ధ్యానాన్ని గూర్చి - గజస్నానం వంటి ధ్యానం మానమని అంతటా, అన్నింటిలోను అందరిలోను ఉన్న పరమాత్మను గుర్తిస్తూ జీవితం గడపడం - సత్యం, ధర్మం, సద్గురు సేవ, సాధారణత్వం సంపన్నత్వం అలవరుచుకోమని బోధించారు. వారి తండ్రిగారు ఎలా భగవంతుని సేవించారో సాయి వారికి వరుసగా కొన్నాళ్ళు ఎలా భౌతిక దర్శనం అనుగ్రహించారో వివరించారు. అలాగే మనలను జీవించి రాజాధి రాజులుగా జీవించమని బోధిస్తూ వారు తన ఆచరణ ద్వారా నేర్పారు.

కష్టాలు అనుగ్రహానికిగుర్తు అన్నారు. విద్యానగర్‌లోని ఉద్యోగం ఉన్న పళంగా ఊడిపోయింది. ఒంగోలులో వారు పెట్టిన ప్రింటింగ్ ప్రెస్ చూస్తున్నవ్యక్తి వెళ్ళిపోయాడు. ఇతర రాబడిలేదు. ఇది అచంచలమైన వారి విశ్వాసానికి వరుపురాయి. మీరంతా ఇలా నన్ను గురించి బాధపడతారే, సాయి ఇప్పుడు నాకేంతక్కువచేశాడు అని, విద్యానగర్‌లో తనకు లేనివి నేడు ఒంగోలులో తనకు ఒనగూడిన వాటిని ఏకరువుపెట్టే వారు. ఉదాహరణకు ఇంటికి ఫ్యాను, నీటి కుళాయిలు, ప్రయాణానికి రైలు వసతి, రైలు దగ్గరకు పోయేందుకు ప్రక్క ఇంట్లో ఫోను, తనను రైల్వేస్టేషనుకు తీసుకపోను వాహన వసతి అన్నింటికీ మించి నిత్యసత్‌సంగాలేగాక నిరంతర సత్‌సంగం లాంటి వన్నీ సాయికరుణ తనపై ఎంతగా ఉందో తెలిపే అంశాలన్నారు. ఈ కష్ట కాలంలో వారి మేధస్సు నుండి వెలువడిన అపురూపమైన ఆణిముత్యమే శ్రీ సాయి ప్రబోధామృతము. సాధారణ మానవులవలె తన ఆర్థిక దుస్తితికి సాయిని నిందించకుండా ఆ మహనీయుని దివ్య చింతనలో మునిగి తీసిన ముత్యమే శ్రీ సాయి ప్రబోధామృతము. ఆరు నెలలలోగానే ప్రింటింగ్ ప్రెస్ 24 గంటల కాలంలో మూడు షిఫ్టులు పనిచేసి ఆర్థిక వసతి చూపారుబాబా. ఆకష్టకాలంలోనే సాయిబాబా పత్రిక ప్రచారం ముమ్మరంగాసాగించారు.





అప్పుడే శ్రీ వెంకయ్యస్వామి వారి చరిత్ర వ్రాశారు. వారి అకుంఠిత విశ్వాసమే వారికి అండ. అందుకే అన్నారు వారు - నీకు భయము. ఆందోళన, దుఃఖము ఉన్నాయంటే వారియందు నీకు విశ్వాసము లేదని లెక్క, అని చెప్పారు.

కష్టాలు అనుగ్రహానికి గుర్తు అని తలంచమని మానవాళికి శ్రీ మాష్టారు బోధించిన సత్యాన్ని గుర్తించి తరింతుము గాక !

కోతిగంతులు వేసే పిచ్చి గంతులుగల మనసు చాంచల్యాన్ని అరికట్టే టందుకు మంచి మందు చెప్పారు. అదే live in the present - ఈ క్షణం ఎలా గడుస్తుందో గమనిస్తూ గడపమంటారు మాష్టారు. అది నాకు సాధ్యం కావటం లేదన్న విద్యార్థితో శ్రీ మాష్టారు live in the present ఎప్పుడు ప్రాక్టీసు చేస్తున్నావోయ్, ఎప్పుడు తీరికుంటే అప్పుడే సార్ అన్నాడు. ఒకేసారి ఆలోచనలే లేకుండా చేయడం కష్టం. మొదట మనం చెప్పిన విషయాన్ని గురించి మనమనసు ఆలోచించేటట్లు, ఆ ఆలోచన వదలి ఇతర విషయాలు ఆలోచించ కుండా ఉండేటట్లు ముందు ప్రాక్టీసు చెయ్. మనం చెప్పిన విషయాన్ని గురించే ఆలోచించటమంటే సాయిని గురించి నీకు తోచిన విషయం యోచించు. అలా ఎంతసేపు నీవు ఎన్ని విషయాలు యోచించావో కూడ నోట్ చేస్తూరా. ఆవిధంగా సద్గురు చింతన మరిగిన మనస్సు వారి కృప వలన లౌకిక చింతనలోనికి పోదు. ఇది కూడా live in the present అవుతుంది అన్నారు.

విష్ణు సహస్రనామాలు ఏమి చెపుతున్నాయి అని అడిగారు శ్రీ మాష్టారు. ఎవ్వరూ సమాధానమివ్వలేదు. విష్ణువునకు వ్యుత్పత్త్యర్థము - అంతటా వసించువాడు. అందు గల డిందులేదని సందేహము వలదు అన్నట్లు.

**విశ్వయజ్ఞాయనమః :**

విశ్వమనబడు యజ్ఞరూపము ధరించిన నీకు నమస్కారము అందులో చెప్పబడ్డవే గాక ఇతర రూపాలు గూడా వారివేనని అనంత రూపాయనమః అనిచెప్పారు. అలాగే నమక చమకములలోను అంతటా నిండియున్న పరమాత్మకు నమస్కరిస్తూ ఉండటమేగాని జటాజూటధారియైన శివుడనికాదు. అలాగే మంత్ర పుష్పములోగూడా అంతటా నిండియున్న పరమాత్మకే నమస్కరిస్తారు.

నోటితో మంత్రంమాత్రం అంతటా నిండిన పరమాత్మకు నమస్కార మని చెపుతూ మనసుతోను కర్మేంద్రియములతోను అలాచేయక పోవడం అజ్ఞానముకదా? అంతటా నిండిన గురుతత్వాన్ని నిరంతరం గుర్తిస్తూ ఉండడమే సాధన అన్నారు.

మానవుని అశాంతికి కారణం త్రికరణశుద్ధి లేక పోవడమే. త్వమేవ మాతాచ, పితాత్వమేవ, త్వమేవ బంధుశ్చ, సఖాత్వమేవ అని పూజలోను హారతుల్లోను నిత్యమూ చెపుతున్నాము. అలానడుచు కొంటున్నామా ? లేదు. పూజలోను, హారతుల్లోను ఆ శ్లోకం చెప్పడం తప్ప మన నడవడిక మారడం లేదు. అలా మనప్రవర్తన మారకుండా ఉన్నంతకాలం మనకీ అశాంతి తప్పదు. మనకు శాంతి, తృప్తి, ఆనందం కావాలంటే - సర్వం మమదేవదేవ - అన్న విషయం ఆచరణలో పెట్టాలి. ఇదొక్కటే మన కష్టాలన్నింటికీ మూలమైన మందు అని మానవాళికి మార్గం చూపిన మహనీయ మూర్తి శ్రీ మాష్టారు.

వారు శ్రీ మహావిష్ణువు యొక్క అవతారమని శ్రీ పాకలపాటి గురువుగారు, శ్రీ వెంకయ్య స్వామి వారు తీర్పుచెప్పారు. శ్రీ దత్తాత్రేయుడే వారు అని శ్రీ రామిరెడ్డి తాత గారు చెప్పారు. ఇంకా అనేక మంది అనేక





విధాల వారిని ప్రశంసించారు. వారు మానవ రూపం దాల్చియున్నందున నాకు వారు మా మాష్టారుగారే. ఈ మహనీయుడు ఎంత దయామయుడో వర్ణించడం నాలాంటి అల్పజ్ఞునివల్ల ఏనాటికీ వీలుకాదు. కన్నీటికి కరిగే మహా కరుణామయుడు. కలిచేడు నుండి ఒక తల్లి దినదినంపస్తులుంటూ విధిలేక తన ముగ్గురు ఆడపిల్లలలో ఒక్కరికి వారి ప్రెస్‌లో పనికల్పించమని నాచేత అడిగించారు. ఒంగోలులో ఆవిషయాలుచూచే వ్యక్తి వీలేకాదన్నారు. శ్రీ మాష్టారు విద్యానగర్ వస్తే ఆతల్లి మాష్టారి మొఖం చూచి కంటతడిపెట్టి ఏమీ చెప్పలేక పోయింది. వెంటనే ఆమె కన్నీటికి కరిగిపోయిన కరుణామయుడు "ఆమెను రేపే ఒంగోలులోని తన ఇంట్లో వదిలిపెట్టు" అన్నారు. ఆ బిడ్డ గత 17 సం॥ల నుండి వారి సేవలోనే ఉంది. వీరి కరుణకు హద్దులులేవు. వారిలోని అట్టి కరుణే సాయి వారిని తనవాడుగా చేసుకొనేటట్లుచేసింది. మనలనుగూడ అట్టి కరుణను గల్గి భగవంతునికి ప్రీతిపాత్రులు కమ్మని బోధిస్తున్నారు.

**సాధకులకు సర్వసాక్షియైన శ్రీ మాష్టరుగారి మంచి సలహా :**

"పాత వాటి విషయం బాబాకు వదలండి, క్రొత్తవి తగిలించుకో కుండా అనుక్షణము జాగ్రత్తగా జీవించండి" అంటారు.

పాతవి అంటే ఇంతకు ముందు సంక్రమించిన ఋణానుబంధాలు అని అర్థం. వాటిని రాహిత్యం చేసే బాధ్యత బాబాకు వదలండి. వారు వాటిని స్వప్నాలద్వారా క్షయింపజేయవచ్చు. శ్రీ సాయిబాబా చరిత్రలో భీమాజీ భాయికి చేసినట్లుచేయవచ్చు. ఈ జన్మలోనే కొండంతను గోరంతగా అనుభవింపజేసి తొలగించవచ్చు. మరికొన్నివారి యోగశక్తితో దహించ వచ్చు. ఇంకెన్నో విధాలవాటిని క్షయింపజేస్తారు. అది వారి బాధ్యత. మనం

చేయవలసినదంతా క్రొత్తవి తగిలించుకోకుండా జాగ్రత్త పడడమే. క్రొత్తవి తగిలించుకోకుండా ఉండడమంటే ఏమిటి ? ఏ వ్యక్తిని గురించిగాని ఒక భావం కల్గియుండరాదు. మనకు మంచిచేసినవాడు మంచి వాడని, చెడు చేసినవాడు చెడ్డవాడని తలవడం సహజం. ఆవిధంగా తలవడమే ఋణాను బంధమేర్పరుచుకొని జనన మరణ వలయంలో చిక్కుకోవడం మంటారు శ్రీ మాష్టారు. మనకు మంచి చేసింది ఆ వ్యక్తికాదు. ఆ వ్యక్తికి మనకు గల పూర్వఋణానుబంధమే ఇప్పుడు వానిచే అలాచేయించింది. ఎన్నో జన్మల నాటి ఋణాను బంధం ఇప్పుడు మనకు సంక్రమింపజేసిన ఆదైవమే నమస్కరింపతగినవాడు. మనకు కీడు చేసిన వ్యక్తి ఎడల కూడా ఇదే వర్తిస్తుంది. మన పూర్వఋణాను బంధం వల్ల దైవం ఆవ్యక్తిని అలా చేసేటట్లు ప్రేరేపిస్తారు. అందువల్ల ఆ వ్యక్తిగాని, దైవంగాని మనం అనుభవించే చెడుకు కారణం కాదు. పూర్వంలో మన అజ్ఞాన కర్మల వల్ల అలాంటి ఋణాను బంధాలు ఏర్పరచుకున్నాము. వాటి ఫలితం అనుభవిస్తున్నాము. ఖర్మఫలం క్షాళన అవుతుంది, అని సంతోషించాలిగాని వీడిలా చేశాడు, తప్పుడు వెధవ అనే ద్వేషభావం వానిఎడల వహించామంటే తిరిగి మరలా కర్మబంధంలో చిక్కామని భావం. అందుకే "పూర్వ జన్మకృతం కర్మతద్దైవ మిదికజ్జతే" అని అన్నారుపెద్దలు.

ఈ మహనీయుని దివ్యశక్తిని వర్ణించ సాధ్యముకాదు. ఏడు సంవత్సరముల నుండి అంగవైకల్యము గల బిడ్డకు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి వైద్యశాలల చుట్టూ తిరిగినా నడవని బిడ్డ, నెల్లూరు జిల్లా కొత్తపాళెం అనే గ్రామంలో రామిరెడ్డి గోపాల్‌రెడ్డిగారి కుమార్తై మల్లీశ్వరికి వీరు పాయసం తినిపించిన తెల్లవారి నుండి నడవడం మొదలుపెట్టింది. ఇలాంటి దివ్యలీలలు లెక్కకు మిక్కుటంగా చేసి ఆర్తుల నాదుకున్నప్పటికి ఆ మహిమ అంతా తన





గురువుగారైన సాయినాధునదే అని తాను వారిసేవకుడు మాత్రమేనని నిరాడం బరంగా పలికేవారు. ఈ నాటికీ ఒంగోలులోని వీరి సమాధికి విన్నవించుకున్న ఆర్తుల సమస్యలన్నీ పరిష్కార మవుతున్నాయి. వీరు మహాసమాధి చెంది పన్నెండు సంవత్సరములకు పైన అయింది. జీతభత్యములు లేకుండా కేవలం భక్తులే నిత్యము వీరి సమాధికి మంగళస్నానము, సుగంధ లేపనముతో వస్త్రధారణ, పుష్పమాలలతో అలంకరణ జరుగుతుంది. ఈ భక్తుల అనుభవాలు ఇక్కడ వ్రాయసాగితే ఒక గ్రంథమే అవుతుంది.

తాను మహాసమాధి చెందే నాటికి తన సర్వస్వం సాయిపాదాల చెంత నుంచి తాను బాడుగ ఇంట్లోనే కాలం గడిపి "మానవుడిచ్చింది నిలువదు. భగవంతుడిచ్చింది తరుగదు" అన్నసాయి మాటను ఆచరించి అలా అందరినీ ఆచరించమన్న పుణ్యాత్ముడు. ఒంగోలు వాస్తవ్యులు రాధయ్య అనే వారు వ్యాపారంలో నాలుగు లక్షలు నష్టపోయి మానసికంగా చాలా దెబ్బతిని నిద్రమాత్రలు మ్రింగినా నిద్రరాని స్థితికి వచ్చాడు. ఇంటిలో అందరికీ వీరి ఆరోగ్యం గురించి ఆందోళనే. ఆస్థితిలో శ్రీ మాష్టారుగారి సన్నిధికి పోవడం అది మొదలు ఏ మందులు లేకుండానే కమ్మగా నిద్రపోవడం, నిత్యం అలా వారిని దర్శించడం అలా ఒక్క సంవత్సరం జరిగాక శ్రీ మాష్టారు గారు వీరిని సాయి చరిత్ర పారాయణ చేయమంటే వీరొక కండిషన్ పెట్టాగు. బాబా నన్ను షిరిడీకి తీసుకపోతే పారాయణచేస్తానని చెప్పాడు. తెల్లవారే ఒక మందిరంలో స్థాపించాలని పాదుకలు తెచ్చి వాటిని షిరిడీకి పంపి బాబాగారి సమాధి వద్ద పూజచేయించమని శ్రీ మాష్టారికిచ్చారు. ఆ పాదుకలను శ్రీ రాధయ్య గారి ద్వారా షిరిడీ పంపారు. ఏ అడ్వర్టయిజ్‌మెంట్ లేకుండా నాణ్యమైన సాంబ్రాణి కడ్డీలు తయారు చేయించి అసలు రేటుకే

వి(క్రయించు. ఇంకు, ఫినాయిల్, సబ్బులు తయారు చేసి వాటిలో లాభాలు నీవు వాడు కోమని రాధయ్యకు మాష్టరుగారు సలహా ఇచ్చారు. అతనలానే ఆసేవ చేస్తున్నాడు.

ఈ రాధయ్యకు శ్రీ మాష్టరు గారు మహాసమాధి చెందాక రక్త విరోచనాలై ఎన్ని మందులు పనిచేయక ప్రమాదము చేసింది. ఆ కష్ట పరిస్థితులలో శ్రీ మాష్టారుగారికి కన్నీటితో విన్నవించారు. నాటి రాత్రి స్వప్నంలో తాను, శ్రీ మాష్టారుగారు హోటలులో ఇడ్లీ, మిరప్పొడి తింటున్నారు. తెల్లవారి అతడు ఇడ్లీ మిరప్పొడి తినగానే తన రక్తవిరోచనాలు మటుమాయ మయ్యాయి. ఈ భక్తుడే ఎంతో శ్రమకోర్చి భక్తుల సహకారంతో నగదు సమీకరించి శ్రీ మాష్టారి బిడ్డలకు గృహము నిర్మించారు.



**ఫిబ్రవరి 9 :**

ఈ విశ్వానికి ఆధారంగా ఉన్న చైతన్యశక్తే సాయినాధుడని సత్యాన్వేషి భరద్వాజకు అనుభవమైన శుభదినం. నాటి నుండి ఆయన సాయిచరిత్ర పరిశోధన ద్వారా దత్త సాంప్రదాయం ఆంధ్రావనికి పరిచయం చేసారు. రాబోవు తరాల వారికి ఈ సాంప్రదాయం అందటానికి మనకు కర్తవ్యం బోధించారు.

దత్తస్వామి ఈ సృష్టి ఉన్నంతవరకు నిత్యము భూమిపై భక్తులకు లభిస్తుంటారు. ఈయన నిత్యము గాణ్గాపూర్‌లో మధ్యాహ్న బిక్ష చేస్తున్నారు. అనేక మంది మహనీయుల రూపంలో భూమిపై సంచరిస్తూ ఉంటారు. సాయినాధుడు దత్తాత్రేయుని సంపూర్ణ అవతారము. దత్తస్వామి ఈ అవతారంలో దేశస్వాతంత్ర్యం కోసం కృషిచేయవలసిన వారిని గత జన్మల నుండి సంస్కరిస్తు దేశసేవ చేసేట్లు చేయడం, మరొక వంక వ్యక్తిగతంగా భక్తుల అవసరాలు చూడడం ఆచార్యులవారి 'సాయిసన్నిధి'లో చూడవచ్చు. ఇలా మానవహృదయాలను సంస్కరించడానికి దత్తస్వామి అనేక సార్లు అవతరించాల్సి ఉందని దీనికి సాయి అవతరణ శంకుస్థాపన అని ఆచార్యుల వారు చెప్తున్నారు. ఇట్టి దత్తావతారకార్యంలో మనందరం పావులమై ఉత్సాహంగా కృషిచేయాలని అందుకుగాను మనం చేయవలసిన పనులలో ముఖ్యమైనది సాయి సాంప్రదాయం గూర్చి అందరికి తెలియచేయడం, సత్సంగాలు చేయడం, సాయిచరిత్ర, గురుచరిత్ర పారాయణల ద్వారా దత్తస్వామి కృపకు పాత్రులు కావాలని చెప్పారు. తమ నాశ్రయించినవారికి

ఎన్నో విధాల మేలుచేయడానికి సిద్ధంగా ఉన్న సాయినాధుడు దత్త సాంప్రదాయము అందరికి పరిచయం కావాలంటే ఒకటి, రెండు దశాబ్దాలు ఇట్టి కృషి జరగాలని దీనిని సత్సంగాల ద్వారా, చరిత్ర గ్రంధాల ద్వారా అందరికి అందించడం గురుసేవగా చేస్తే అందరికి ఉత్తమ జీవితవిధానం తెలిసి వారి రాబోవు జన్మలన్నీ ఉత్తమంగా ఉంటాయని ఆచార్యుల వారంటారు. ఆధ్యాత్మికత అంటే ప్రజలలో అవగాహన కల్గించాలని దాని లక్ష్యమైన కొరతలేని "తృప్తి", "శాంతి" గురుకృప ద్వారా తాను పొంది నిరూపించారు. వారి సన్నిధిలో ఎందరో భక్తులు ఇట్టి శాంతిని అనుభవించారు. సృష్టిలోని సకలజీవుల కోర్కెలు తీరితే ఎంత ఆనందం లభిస్తుందో ఆ ఒక్కడు అంత ఆనందం పొందుతాడని, అట్టిది సద్గురు కృపతో సాధ్యమని అట్టి విద్య నందించేది ఆధ్యాత్మికతని ప్రజలలో అవగాహన కల్గించేందుకు కృషి చేయాలన్నారు.

ఇట్టి కృషి మనకు చిత్తశుద్ధి ప్రసాదించి గురుకృపను ప్రసాదిస్తుందని ఇలా కాక మనం ఆధ్యాత్మికతలో ముందుకు పోలేమని చెప్పారు. శ్రీ రంగన్న బాబు, శ్రీ రామకృష్ణ పరమహంస వంటి వారందరూ గత జన్మలలో ఇట్టి కృషి సల్పినందువలనే ఈ జన్మలో అంతటి ఫలితం లభించిందంటున్నారు.

యువతీ యువకులకు ఆధునిక విజ్ఞానంతో సమన్వయం చేసిన ఆధ్యాత్మిక గ్రంధాలైన ఏదినిజం, మతం ఎందుకు, విజ్ఞాన వీచికలు అందించి వాటిపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి అందులో చురుకుగా పాల్గొన్న వారిని పారితోషికాలతో సత్కరించాలని ఆచార్యుల వారి సూచన. ఇట్టి ప్రయత్నం జరుగకపోతే రాబోవు తరాలవారికి భక్తిభావంలోపించి ఇప్పుడు మనం నిర్మిస్తున్న మందిరాలను తృణీకరించే అవకాశం ఇచ్చినవారమని తద్వారా భగవంతుణ్ణి కించపరచిన దోషం మనకు సంక్రమిస్తుందని మాష్టరుగారన్నారు.

చరిత్ర పారాయణ చేసేటప్పుడు చిత్రపటం రూపంలో సాయినాధుడు ఎదురుగా ఉన్నారని గుర్తించి ప్రతిసారి మొదటిసారి చదివినంత క్రొత్తగా చదివితేనే సత్ఫలితం ఉంటుందని బాబా కుశాభావుచేత "గురుచరిత్ర" 108 సార్లు అలానే చేయించారని మనకు చెప్తున్నారు. దత్తస్వామిని ప్రేమతో పిలుస్తున్నట్లుగా నామస్మరణ చేయాలని మాష్టరుగారు చెప్తున్నారు.

ప్రజలకు ఆధ్యాత్మికత, గురుసేవ, దత్తసాంప్రదాయం ఎంత తొందరగా తెలిస్తే అంత తొందరగా ప్రశ్నలు, పూనకాలు, కపటగురువుల బారినిండి బయట కొస్తారని తొందరలోనే ఆంధ్రప్రజలకు దత్తానుగ్రహం లభించి సుఖశాంతులు పొందాలని మాష్టరుగారి ప్రయత్నం.

పై చెప్పిన విషయాల దృష్ట్యా ప్రజలలో ఎక్కువమంది ఏకాగ్రతతో ప్రార్ధనచేస్తే భగవంతుడు అట్టి సంకల్పం నెరవేర్చ గల కార్యదక్షులను మనమధ్యకు పంపుతాడని ఆచార్యవాణి.

అట్టి సత్సంకల్పం నెరవేరగలందులకు ఈ దత్తావతారకార్యంలో మీరు పాల్గొని దత్తస్వామి కృపకు పాత్రులు కావాలని ప్రార్ధిస్తూ,

**సాయిమాష్టర్ భక్త సమ్మేళన ఆహ్వాన కమిటీ**

# మత నిర్మాణంలో శ్రీ మాష్టారి బోధలు

ఈ క్రింది అనుభవాలన్నీ చదివినాక ఇవి శ్రీ మాష్టరుగారే బోధించారనడానికి ఆధారమేమిటి? అని అడిగే వారు తప్పక కొంత మందైనా ఉంటారు. ప్రారంభోత్సవం వచ్చేస్తుందని కంగారుపడి పనులు కాలేదని బాధపడే సమయంలో ఇది నిష్కామకర్మ, మలదోషనివారణకే చేస్తున్నాము - క్రొత్తవి తగిలించుకోకూడదు. ఎవరిమీద ఎలాంటి భావాలు పెట్టుకున్నా సాధనలో అంతరాయమే. నీవు నిశ్చలంగా కూర్చో, అవసరమైనదంతా నేనే చేస్తాను. నిశ్చలంగా కూర్చోమంటే నిష్క్రియత్వం కాదు. మానసిక అలజడి మానమని అర్థం. ఇలాంటి భావాలన్నీ ఆయా సమయాలలో గుర్తుకు రావడం తదను గుణంగా మానసిక ప్రవర్తనలో మార్పురావడమే మాష్టారిబోధ అని చెప్పేందుకు ఆధారము. ఈ భావాలు ఎల్లవేళల నన్నాశ్రయించి ఉండేటట్లు చేయమని ఈ భావాల నుండి పడిపోకుండా చేయమని పూజ్యపాదులు శ్రీ మాష్టారికి సాష్టాంగ దండ ప్రణామములాచరించి ప్రార్థిస్తున్నాను.

పెసల సుబ్బరామయ్య



పూజ్యశ్రీ మాష్టరుగారు చెప్పిన బోధలన్నింటిలోను అతిముఖ్యమైనది - "క్రొత్తవి తగిలించుకోవద్దు - పాతవాటి సంగతి బాబాకు వదలండి" అన్నమాట. దీనితో గూడ నిరంతరం గుర్తుండవలసిన మరొకమాట - "ఎవరి మీద ఎలాంటి భావం కలిగియున్నా అది సాధనకు అంతరాయమే" అంటారు. ఆచరణలో ఈ మాట ఆచరించడం చాలా కష్టం, అట్లని వీలుకానిది మాత్రం కాదు. ఒక వ్యక్తి మనకొక వస్తువు ఇవ్వలేదు. ఆ వ్యక్తిపై మనకు పిసిని గొట్టనో మరొక విధమైన భావమో ఉండవచ్చు. అది తప్పు. భగవంతుడు ఆ వ్యక్తి ద్వారా ఇప్పించడం లేదు - అన్నదొక్కటే సరైన భావన. "ప్రతి చిన్న విషయానికీ గురువు మీద ఆధారపడు అదే అసలైన సాధన" అన్నమాట ప్రతి విషయంలోను ఆచరిస్తుండడమే మనధ్యేయం. గొలగమూడిలో శ్రీ బ్రహ్మం గారి మఠం పునరుద్ధరణ అనే పనిపెట్టి ఆ పనిద్వారా అనేక పాఠాలు నేర్పించారు.

ఒక వ్యక్తిని సున్నం కొట్టేందుకు పిలిచాను. సున్నం వేసే బ్రష్షు తన దగ్గరున్నదని, తీసుకొచ్చుకుంటానని ముందు రోజు చెప్పాడు. తీరా పనిలో కొచ్చి బ్రష్షుకావాలి అంటాడు. ఇప్పుడు బ్రష్షెక్కడదొరుకుతుంది అంటే అతనే ఒక అడ్రసుచెప్పాడు. అక్కడికిపోతే ఆమె బ్రష్షుఇవ్వనంటే ఇవ్వ నంటుంది. బ్రష్షుఉంది. కానీ ఇవ్వనంటుంది. రేపు మఠం ప్రారంభోత్సవం. ఈ రోజు సున్నం వేసితీరాలి. ఇప్పుడే మనిషిని నెల్లూరు పంపించి క్రొత్త బ్రష్షు తెచ్చిఇస్తానన్నా ఇవ్వలేదు. అంతవరకు డబ్బు వంద రూపాయలు మీదగ్గరుంచుకోమన్నాను. డబ్బు మీరే చూచినట్లుంది. పోపో వయ్యా అంది.

మామూలు ధోరణిలో - 'ఈమె ఇంత కఠినంగా మాట్లాడుతుందే' అనే భావం వచ్చింది. వెంటనే శ్రీ మాష్టరుగారి కృపవల్ల "పని సఫలమైనా,

విఫలమైనా మానసిక సమత్వం కోల్పోరాదు. అదే నిష్కామ కర్మకు గీటురాయి" అన్న మాష్టారి మాట గుర్తుకు వచ్చింది. వెంటనే "ప్రతి చిన్న విషయానికీ గురువు మీద ఆధారపడు, అదే అసలైన సాధన" అన్నమాట గుర్తుచేశారు. ఈమె దగ్గర బ్రష్ తీసుకోవడం గురువుగారికి ఇష్టంలేదు. అందువల్ల ఆమెకు ఇవ్వబుద్ధికాలేదు అని అక్కడ నుండి వెళ్ళిపోయాను.

సున్నంవేసే మనిషి చెప్పిన మరిరెండు అడ్రసులవాళ్ళ దగ్గరకు వెళ్ళాను. అక్కడ కూడా వాళ్ళు బ్రష్షులేదని చెప్పారు. వస్తూ, వస్తూ నా సొంతంగా నాలుగు సంవత్సరాలనాడు మిద్దెకట్టుకున్న వాళ్ళింటికి వెళ్ళి అడిగాను. చిత్రంగా ఆమె మారుమాట చెప్పకుండా క్రొత్త బ్రష్షు ఇచ్చింది. గురువుగారికి వీరి బ్రష్షుతీసుకోవాలని కోరిక కలిగింది అని ఎంతో ఆనందంగా వచ్చాను. ఆసున్నం వేసే అతను ఇది చిన్న బ్రష్షు, ఇది పనికి రాదు. చేతులు నొప్పులు వస్తాయి వద్దు అన్నాడు. ఇక చేసేది లేక నాదగ్గరున్న అరిగిపోయిన పాత బ్రష్షుతో వేయగలిగినంత వేయమని ఇంటికి వచ్చేస్తున్నాను. సున్నం వేసే వానిపైనగాని, బ్రష్షు ఇవ్వనివాళ్ళమీదగాని, ఇచ్చిన వారిపైన గాని ఎలాంటి భావాలు లేకుండా మన ప్రారబ్ధం తీరేందుకు ఇలా తిప్పుతున్నాడు. సంతోషంగా తిరుగుతూ క్రొత్తవి తగిలించుకోకుండా ఉండాలి అనే భావాలు నెమరువేసుకుంటూ దారి నడుస్తున్నాను. ఎప్పుడో ఆరు సంవత్సరాల క్రిందట మిద్దె కట్టుకున్న వారిని బ్రష్షు అడగాలని పించింది. ఎందుకులే అడగడం. వాళ్ళదగ్గర ఉండబోతుందా? అని ఒక భావం. ఏమి అడిగితే నోటిముత్యాలు రాలిపోతాయా? ఇస్తే ఇస్తారు లేకుంటే లేదు. అంతేగదా అనుకుంటూ ఆ ఇంటికే వెళ్ళాను. సున్నం కొట్టుకునే బ్రష్షు పాతదుంటే ఇవ్వమన్నాను. పాతదా, క్రొత్తదా? అన్నారు. డబ్బిస్తాను క్రొత్తదయినా పరవాలేదు అన్నాను. పెద్ద





ఇల్లా, చిన్న ఇల్లా అని అడిగాడు. ఇల్లు కాదండీ, బ్రహ్మంగారి మఠానికి అన్నాను. వెంటనే ఆయన రెండోమాట మాట్లాడకుండా సంతోషం మొగములో తాండవిస్తుండగా పెద్ద బ్రష్షు కొత్తది ఇచ్చాడు. గురువుగారు వాళ్ళవద్ద బ్రష్షు తీసుకోదలచారు. తక్కిన తిరుగుడంతా మనకు పాఠాలు నేర్పేందుకే. ఎవరి మీద ఎలాంటి భావాలు పెట్టుకున్నా సాధనలో అంతరాయమే. ప్రతి చిన్న విషయానికీ గురువు మీద ఆధారపడు, అదే అసలైన సాధన. క్రొత్తవి తగిలించుకోవద్దు. మానసిక సమతుల్యత్వం కోల్పోకుండా ఉండడమే నిష్కామ కర్మకు ఆసిడ్ టెస్ట్ అన్న ఆచార్యుల మాటలన్నీ ఈ సన్నివేశంలో నేర్పారు.

**షామియానాలు విప్పడం :**

మఠం ప్రారంభోత్సవానికి ముందు రోజే షామియా[illegible]లు వేయించాము. షామియానాలు వేసిన అరగంటలోనే వాతావరణం [illegible]రి మారిపోయి వర్షపు జల్లుప్రారంభమైంది. అక్కడున్న మిత్రులు [illegible]ం ఆపమని స్వామికి దండం పెట్టండి. వర్షానికి షామియానాలు [illegible] పోతాయి. షామియానా క్రింద నిలుచోలేము, వర్షపునీరు కారుతూ [illegible] అని సలహాయిచ్చారు. అదేదో మీరేపెట్టండి ఆదండం అని పైకి అన్నాను కానీ మనసులోగూడా స్వామికి వర్షమాపమని చెప్పుకోలేదు. వెంటనే శ్రీ మాష్టారి బోధ గుర్తుకొచ్చింది. శ్రీ స్వామి వారు సర్వసాక్షిగదా? మనమిక్కడ షామియానాలు వేసిన సంగతి వారికి తెలుసుగదా! మనకేది మంచిదైతే అదేచేస్తారు. షామియానాలు తడిసి విప్పివేయాలని వారి నిర్ణయమైతే అది తప్పుతుందా? అలావిప్పి మరలా వేసుకోవడమే మంచిదై మనశారీరక కర్మ

నశించాలంటే వారు రాత్రిపూటైనా తడిపేస్తారు. నిష్కామ కర్మకు గీటురాయి ఏమిటి? పని సఫలమైనా విఫలమైనా మనసు బాలన్సుగా ఉంచుకో గల్గడమే గదా! అనే భావాలు వరుసగా దొర్లాయి మనసులో, ఇదంతా శ్రీ మాష్టారు నాపైకరుణతో సమయానికిగుర్తుకు తెచ్చినబోధ మాత్రమే. ఒక్క క్షణంలో వర్షం ఆగిపోయి ఎండవచ్చింది. అందరికీ వర్షమాగిందని సంతోషమైతే, నాకు మాత్రం సమయానికి చక్కని మరుపురాని బోధగుర్తుకుతెచ్చారని ఆనందమైంది.

**మేళ్ళగాళ్ళు ఉచితంగా వాయించడం :**

అన్ని ఏర్పాట్లు శ్రీ స్వామివారే చేయిస్తున్నారు అని నోటితో అన్నా మనసులోను, ఆత్మలోను ఆ భావం నాకు చక్కగా ఆచరణకు రాలేదు. డబ్బు చేతిలో చాలా స్వల్పంగా ఉంది. చిన్నగా శ్రీ స్వామివారు వచ్చి ప్రారంభోత్సవం అయిపోతే చాలని ఉన్నాను. ఖర్చులన్నీ తోసేస్తున్నాను. శ్రీ స్వామివారు వచ్చేటప్పుడు మేళగాళ్ళను పెట్టి పూర్ణకుంభాలతో స్వాగతం పలుకమన్నారు. మేళగాళ్ళకు డబ్బులేదని ఆ ప్రోగ్రాం తీసేశాను. వారికి స్వాగతం పలికేందుకు రెండు మంచి పూలమాలలు తెప్పించమన్నారు. బజారులో కొనేవాటి కంటే నామ జపం చేస్తూ తులసిదళాలు, పూలరేకులతో కట్టిస్తే ఖర్చు తగ్గుతుంది, పవిత్రంగా ఉంటుందని అలా చేశాను. ప్రసాదము గా తీపు బూంది తెప్పించమంటే రవ్వకేసరి తయారుచేశాము. అన్ని విషయాలు ఇంతే. 26వ తేది ప్రారంభోత్సవము. 24వ తేది క్షౌరము చేయించుకుంటుంటే ఆ మంగలి అతను శ్రీ దర్గాస్వామి వారు ఎప్పుడు వస్తారు సార్ అని అడిగాడు, 26వ తేది ఉదయం అన్నాను. వెంటనే అప్పుడు మేము మేళం వాయించు





తాము స్వామీ! అన్నాడు. వాయించుతే వాయించండి. డబ్బులు నాదగ్గరలేవు అన్నాను. వద్దు స్వామీ, ఆమహనీయుని దగ్గర వాయించాలని మా ఉబలాటము అని వచ్చి ఫ్రీగా వాయించారు. అప్పుడు నా మనసులోను, హృదయంలోను అన్నీ శ్రీ స్వామివారే చేయించు కుంటున్నారు. మనం అజ్ఞానంతో అహంకారం (నేను చేస్తున్నాను) నెత్తినేసుకుంటున్నాము అని హృదయగతమైంది. ఈ భావం రావడమే శ్రీ మాష్టారిదయ. "నీవు నిశ్చలంగా కూర్చో, అవసరమైన దంతా నేనే చేస్తాను". ఈ మాట సాయి అన్నారు అని శ్రీ మాష్టారు వ్రాశారు. నాకు మాత్రం అనుభవానికి వచ్చేటట్లు అర్థంకాలేదు. ఈ ఒక్క అనుభవంతో దానిభావం హృదయగతమైంది. బ్రహ్మంగారి మఠంలో పూజారి రూముకు తలుపుపెట్టాలి. అన్నీ చెక్కలు, రేకు, బోల్టులు తెచ్చిపెట్టాను. కంసాలికి అది బిగించినందుకు వంద రూపాయలు ఇవ్వాలి. ఆ డబ్బులేక ఆ పని ఆపేశాను. మఠం ప్రారంభోత్సవం రేపనగా మఠం నుండి ఇంటికి పోతున్నాను. జయమ్మగారు శ్రీ భరద్వాజ ఆశ్రమం కట్టిస్తుంటే అక్కడికి పోవాలని పించి వెళ్ళాను. అక్కడ కార్పెంటర్ వాళ్ళకు తలుపు తయారుచేస్తున్నాడు. తలుపు చేసినందుకు ఎంత తీసుకుంటావు అని అడిగాను. వీళ్ళ దగ్గర ఏమీ తీసుకోను సార్ అన్నాడు. పోనీ మా దగ్గరైతే ఎంత ఇవ్వాలి అన్నాను. మీ దగ్గరకూడా ఏమీ తీసుకోనుసార్. మీరు చేయించేది దేవుని పని గనుక అన్నాడు. అట్లాగయితే ఒక్క గంట నాకు పనిచేసి మఠం దగ్గర ఒక రేకు తలుపు పెట్టాలన్నాను. అన్ని వస్తువులు ఇక్కడకు చేర్చండి అట్లాగే చేస్తానన్నాడు. అన్ని వస్తువులు అక్కడ పెట్టాము. 1 గంట అన్నది రెండు గంటలలో తలుపు బిగించి ఒక్క పైసా తీసుకోలేదు.

కార్పెంటర్‌కు ఇచ్చే డబ్బు నా దగ్గరలేదని మానుకుంటే, నాలో చిత్రమైన ప్రేరణబెట్టి అక్కడకు తీసుకువెళ్ళారు. ఆ కార్పెంటరుకు అలాంటి

ప్రేరణనిచ్చి వెంటనే తలుపు బిగించేటట్లు చేశారు. పైసా ఖర్చులేకుండా అంతా శ్రీ స్వామి వారే నెరవేర్చారు. నిశ్చలంగా కూర్చుంటే అవసరమైనదంతా సాయి ఎలా చేస్తారో బాగా హృదయగతం అయ్యేటట్లు చేశారు. సర్వప్రేరణాధికారికి అసాధ్యమేముంది. "క్రొత్తవి తగిలించుకోవద్దు. ఎవరిమీద ఎలాంటి భావం ఉన్నా సాధనకు అంతరాయమే". ఈ వాక్యాలు సకాలంలో గుర్తుకు రావడమే శ్రీ మాష్టారిదయ అని నా భావము.

సున్నం వేసే వానికి 1 గంట పని మిగిలిపోయింది. రేపు వచ్చి ఈ కాస్తపనిపూర్తి చేయమని చెప్పి యాభైరూపాయలు ఎక్కువగా ఇచ్చాను. సరేనని వెళ్ళాడు. కానీ తెల్లవారి రాలేదు. వాళ్ళింటికి పోతే వేరే గ్రామం వెళ్ళాడని చెప్పారు. తర్వాత రోజే ప్రారంభోత్సవం. ఉదయాన్నే చాలా మంచు, నాకు ఆయాసం. అయినా వెతుక్కుంటూ మరొకరిదగ్గరకు వెళ్ళాను. అతను వచ్చి ఆపనిచేశాడు. కానీ మొదటివానిపై మామూలు ధోరణిలో మోసగాడు డబ్బు ఎక్కువ తీసుకొని పనికి ఎగగొట్టాడు అనే భావాలు దొర్లాయి. కాని శ్రీ మాష్టారి దయవల్ల "క్రొత్తవి తగిలించుకోవద్దు, ఎవరిమీద ఎలాంటి భావాలు పెట్టుకున్నా సాధనలో అంతరాయమే" అనే మాటలు సమయానికి గుర్తు వచ్చాయి. అపరాధానికి చెంపలేసుకొని అతనిమీద ఏర్పడ్డ భావానికి పశ్చాత్తాప పడ్డాను. ముందు నిర్ణయం ప్రకారం అతని ద్వారా పనిపూర్తి చేయాలనిలేదు. మరొకరి ద్వారా ఆపని పూర్తి చేయాలని ఉంది. ఇప్పుడతడు రాలేదంటే ఏమి వస్తాడు. మన భావాలన్నీ మనకు ఋణానుబంధం సృష్టిస్తాయే తప్ప ఏ ప్రయోజనమూ లేదు. ఇది ఎరిగి నిర్లిప్తంగా పని జరిగించడ మొక్కటే కర్తవ్యం. ఈ నిష్కామ కర్మచేయడం ద్వారా కర్మవదలకొట్టుకునే చోట క్రొత్తవి తగిలించుకుంటున్నాము అనేది అనుక్షణము గుర్తుండాలి.





"నీవు నిశ్చలంగా కూర్చో అవసరమైనందంతా నేనే చేస్తాను" అన్న మాటలో సోమరిగా కూర్చోనుండమని చెప్పలేదని - మానసికంగా అలజడి లేకుండా స్థిమితంగా నీ ప్రయత్నాలు నీవు సాగించమని నాకు అర్థమైంది. మా ఇంటి నుండి నాలుగు సిమెంటురేకులు శ్రీ బ్రహ్మంగారి మఠానికి తీసుకుపోవాలి. ప్రారంభోత్సవ టైంనకు ఆపని పూర్తిచేయాలి. చినుకు మబ్బుగా ఉంది. బేలుదారి వచ్చియున్నాడు. పని జరుగుతుందని నమ్మకం లేదు. పని జరిపి తీరాలని నాకు పట్టుదల, ఆశ. సరే మన ప్రయత్నం మనం చేయాలని నలుగురు మనుషుల కోసం దోవనడుస్తున్నాను. ఎంత చిత్రమోగానీ నా విద్యార్థి సంచి పట్టుకొని ఎదురైనాడు. ఎక్కడికి పోతున్నావని అడిగితే ముందు మీ పని ఏమిటో చెప్పండి తర్వాత నాపని చూస్తామని నావెంట వస్తున్నాడు. రెండడుగులు వేసేలోగా మరొక మిత్రుడు పూరీ బాక్సు చేతపట్టుకొని కనిపించాడు. ఎక్కడికంటే ముందు మీ పని చేసి తర్వాత పూరీబాక్సు సంగతి అన్నాడు. హోటల్లో టిఫిన్ అయిపోతుంది అంటే ఒక్క రోజుకు టిఫిన్ లేకుంటే ఏమీకాదు అని వెంటపడ్డాడు. ఇంతలో బేలుదారి వచ్చాడు. ఇంకొక్క మనిషికావాలి. ఆ మనిషికి బదులు నేనే మోస్తా మనుకున్నాను. మరొక మిత్రుడు హోటలు నుండి ఉన్న పళంగా లేచివచ్చి సహకరించాడు. మొత్తం ఐదునిమిషాలలోగా నలుగురు మనుషులు సమకూడడం, అందులో ఆత్మీయులు దొరకడం, అందరూ ఒకరి వెనకాల ఒకరు రావడం అంతా సాయి ప్రోగ్రాం అని నిరూపించారు. నిశ్చలంగా కూర్చోమంటే నిష్క్రియత్వం కాదని మానసిక అలజడి లేకుండా ప్రయత్నం చేయడమని బోధపరచారు.

ఆపదవచ్చాక మ్రొక్కుబడి చెప్పుకుంటే ఆపదతీరడం చాలా తక్కువ స్థాయి అనుభవం. ఆపదరాకముందే దాని నుండి తప్పించుకునే విధంగా మనలను నడిపించడమే గొప్ప అనుభవమని నా నమ్మకము. కలిచేడు మందిర ఎన్నికలు జరుగుతున్నాయి. అన్ని పోష్టులకు అందరూ అంగీకరించారు. కానీ ప్రెసిడెంటుగా ఉండేందుకు ఒక్కరూ అంగీకరించలేదు. అందరూ ఒక వ్యక్తిని సూచిస్తారు. కానీ ఆవ్యక్తి అంగీకరించడు. అందరూ సమావేశ మయ్యారు. నేనావ్యక్తితో చెప్పాను - శ్రీ సాయి దగ్గర చీట్లు వేస్తాము. ప్రెసిడెంటుగా ఉండమని వస్తే ఉండండి, వద్దంటే మానెయ్యండి అని చెపితే అతడంగీకరించాడు. నేనే రెండుచీట్లు వ్రాసి సాయి పాదాలచెంత ఉంచి - మీరు ధ్యానం చేసుకొని ప్రార్థించండి, మీరు తీయమంటే తీయిస్తాము అని చెప్పాను. ఆయన తీయమంటేనే ఒక చిన్నపిల్లవానిచేత తీయించాము. ప్రెసిడెంటుగా ఉండమని వచ్చింది. ఆ చీటీ ఆయన కిచ్చి చదువుకోమన్నాను. రెండవ చీటీ చించినాకు 3 అ॥ దూరంలోనున్న ప్రహరీగోడ అవతల విసిరి పారేయబోతున్నాను. అక్కడ అలివిగాని కంప్రతుమ్మచెట్లున్నాయి. అక్కడ పారేస్తే ఆ ముక్కలు ఇక వచ్చే ప్రసక్తేలేదు. ఎందుకో నాకు తెలియకుండానే ఆ చించిన ముక్కలు ఆ వ్యక్తికిచ్చి వాటిని కలిపి చదువుకోమన్నాను. ఆ ముక్కలు కలిపి చదివిన ఆ వ్యక్తి అంత మందిలో బావురుమని ఏడ్చేశాడు. అతడు చెప్తాడు - అయ్యవారు రెండు చీట్లలోనూ ఉండమనే వ్రాసి ఉంటాడు అని అనుకున్నాడట. ఈ చించిన చీటీ ఇవ్వగానే తానెంతనీచమైన ఆలోచన చేశానోనని తెలిసివచ్చి ఏడ్చానన్నాడు. ఆ చీటీ బయట పారేయకుండా నన్నడ్డుకున్నవారు శ్రీ సాయినాధుడే. నేను ప్రార్థించకున్నా నన్నాదుకున్న కరుణామయుడు వారే.



## శ్రీ మాష్టారి ఆశయం

1. సర్వ జనులకు సాయికృప అందించడం.
2. సాయి కృపద్వారా అందరూ ఆనందం పొందాలి.
3. నిత్య సత్‌సంగాలు జరిపి సాయిని చేరుకుందాం.
4. భగవంతుడు కోరే కాలము మనస్సు భగవంతునకు సమర్పించుదాం.

**పోటీలు, పంతులు, కీచులాటలు మానితే దేవుడు కాపాడుతాడు**

## శ్రీ మాష్టారు నేర్పిన పాఠాలు

1. నిష్కామకర్మ.
2. జీవితంలో మనం చేసే ప్రతిపనీ సాయి సేవగా చేయగల్గడం.
3. వేలమంది సహకారంతో తయారైన ఆహారం తింటున్నాము గనుక ఆ జీవులలోని పరమాత్మకు ఋణగ్రస్తులం కాకుండా ఇతర జీవుల శ్రేయస్సుకు పాటు పడుదాం.

# తృతీయ అఖిలాంధ్ర సాయిమాష్టర్
# భక్త సమ్మేళనం సందర్భంగా

వేదిక : శ్రీ షిర్డీసాయిబాబా మందిరం,
లాయర్‌పేట, ఒంగోలు.

తేదీలు : ఫిబ్రవరి 9, 10 - 2002



సమర్పణ

## శ్రీ షిరిడీ సాయి భరద్వాజ సత్సంగము

గుంటూరు.

ఫోన్స్ : 352891, 353804, 237013, 250257